క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని గుత్తావారిపాలెం, ఓలేరు, గొరిగపూడి, దాసరిపాలెం, కన్నెగంటివారిపాలెం, కోళ్లపాలెం, తూర్పుపాలెం, గాజులపేట, జిలుగువారిపాలెం, పెదపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. పెదపులివర్రులో విద్యుత్ సరఫరా యధాతథంగా ఉంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



చుండూరు(భట్టిప్రోలు): ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.అగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చుండూరు మండలం ఆలపాడు, చినపరిమి గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అగస్టీన్ మాట్లాడుతూ 6 వారాల నుంచి వేతనాలు రాకపోవడం వల్ల కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉపాధి చట్టం ప్రకారం పని దినాలకు రెండు వారాల లోపు వేతనాలు ఇవ్వాలని అన్నారు. బడ్జెట్‌లో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 30 వేల కోట్లు తక్కువ కేటాయించారని తెలిపారు. ఉపాధికి నిధులు పెంచి గతంలో ఇచ్చిన మాదిరిగా తాగునీరు, పలుగు, పారలకు నగదు, మెడికల్ కిట్స్ ఇవ్వాలని, మేట్లకు ఇచ్చే పారితోషకంతో పాటు సమ్మర్ అలవెన్స్‌లను పునరుద్ధరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి పూజలు



గుంటూరు రూరల్: భూమి తల్లిని కొలిచి పంటకాలంలో మంచి దిగుబడులు సాధించాలని కోరుకుంటూ చేసుకునే రైతన్నల పండుగ ఏరువాక పౌర్ణమి అని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధర్యంలో పంటపొలంలో ఏరువాక సాగి వేడుకలను నిర్వహించారు. భూమి పూజ చేసి ఎద్దుల అరకతో ఏరువాకను ప్రారంభించారు. పొలంలో ధాన్యం చల్లి పంటలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఉసర్పంచ్ నామా శ్రీనివాసరావు, గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని: ఏరువాక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామంలో ఏటా జూన్‌లో వచ్చే ఏరువాక పౌర్ణమి రోజున రైతులు తమ ఎడ్లతో, ప్రభలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది కూడా రైతులు, పిల్లాపాపలతో శుక్రవారం సాయంత్రం వినాయకుడి గుడి వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు వృద్ధి చెందాలని మొక్కారు. పలువురు రైతులు ఎడ్ల బండ్లు, అరకలు కట్టుకుని, ట్రాక్టర్లతో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉదయం గ్రామ మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచి పులగం రామిరెడ్డి, పలువురు రైతులు గణపతికి జలాభిషేకం నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

పెదకాకాని: విద్యావంతులైన బాలల వల్ల మెరుగైన సమాజం ఏర్పడుతుందని గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో శుక్రవారం చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ – క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసాన్ని పురస్కరించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఆడియో ప్రకటన ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాలలను బాగా చదివించాలని, తల్లిదండ్రులకు బాలలందరినీ స్కూలుకి పంపించే విధంగా అవగాహన కల్పించాలని బాలల హక్కుల చట్టాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని అంతం చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 – 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలలను ప్రమాదకరమైన సంస్థలో నియమించటం నిషేధించబడిందని తెలిపారు. ఈ సమావేశంలో హైస్కూల్ హెచ్‌ఎం డీవ ప్రభాకర్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కళ్లం హరినాథ్‌రెడ్డి
- పలు పాఠశాలల్లో నిర్వహించిన యోగా దినోత్సవానికి హాజరైన డీఈవో నారాయణ
- వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం



అమర్తలూరు పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న నిర్వాహకులు

బాపట్లటౌన్: దేహ దారుఢ్యంతో పాటు శారీరక సౌష్టవానికి యోగాసనాలు ఎంతగానో దోహద పడతాయని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కళ్లం హరినాథ్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల్లో యోగ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఏకో హౌస్ ప్రాంగణంలో యోగా డే నిర్వహించారు. తొలుత పట్టణంలోని ప్రముఖులు, విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించారు. కళ్లం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ యోగా విద్యను అభ్యసించిన యోగా ఉపాధ్యాయులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. బాపట్ల పట్టణంలో 2025, 2026 సంవత్సరాల్లో జాతీయ యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, పిరమిడ్ సభ్యులు కేశవరావు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో..

విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కె. నారాయణ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించారు. డీఈవో కె.నారాయణ మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగాసనాలు చేయటం వలన విద్యార్థుల్లో ఆలోచన శక్తి మెరుగుపడుతుందన్నారు. మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగాసనాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ వి.సుధాకర్, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా యోగా నోడల్ ఆఫీసర్ బిళ్లా మోజెస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో..

పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతో పాటు యోగాసనాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. యోగా ప్రతిరోజు చేయటం ఒత్తిళ్లు అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో..

పట్టణంలోని ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ విమల మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం, ఒత్తిడి నివారణకు యోగా విశిష్టత ఎనలేనిదన్నారు. యోగాసనాల్లో పాల్గొన్న విద్యార్థినులకు రాగిజావ, మొలకలను అల్పాహారంగా అందజేశారు.



రేపల్లె ఆర్‌సీ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ఐఎన్‌వో ప్రతినిధులు



రేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో సూర్య నమస్కారాల సాధన

రేపల్లె రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆర్‌సీ డిగ్రీ కళాశాల డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ నేచురోపతి ఆర్గనైజేషన్ (ఐఎన్‌వో) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌సీ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచవచ్చన్నారు. విద్యార్థి దశలో యోగాతో పాటు ధ్యానం అలవరుచుకుంటే ఏకాగ్రత మెరుగుపడటంతో పాటు జ్ఞాపక శక్తి పెంపొందించుకోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ ఖాళీ సమయంలో యోగా చేయాలని కోరారు. అనంతరం ఐఎన్‌వో ప్రతినిధులు విద్యార్థులకు యోగాసనాలు చేసే విధానాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌వో స్టేట్ జాయింట్ సెక్రటరీ డి.లక్ష్మణరావు, యోగా ట్రైనర్ వరప్రసాద్, బీజేపీ ఎస్సీసెల్ సభ్యుడు బి.వెంకటేశ్వరరావు, మహిళా మోర్చ స్టేట్ మెంబర్ ఎస్.నీజర, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత వృద్ధి

భట్టిప్రోలు: ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ధ్యానం, యోగా వల్ల మంచి ఆరోగ్యం, మనసుకు ఆనందం కలుగుతుందని అన్నారు. యోగాలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్ఎస్ఎఫ్ ద్వారా భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాచర్ల మోహన్‌రావు, వేదాంతం బదరీనాథ్, ఎస్ఎస్ఎఫ్ బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొత్త నాగ వెంకట రవితేజ, వాసవీ క్లబ్ నిర్వాహకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, బి.విజయ్‌కుమార్, ఎస్. పూర్ణ చంద్రరావు, ఎస్ శ్రీనివాసరావు, ఎం. ఉమాశంకర్, ఎంఎం వెంకటేశ్వరరావు, టి. ఈశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

వేమూరు: ప్రతి ఒక్కరూ యోగా ఆచరిస్తే ఆరోగ్యంగా ఉంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. యోగా సాధకులు వీసా మనోజ్ఞ, సుమని పాల్ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో ప్రశాంత జీవనం

వేమూరు: యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషగిరి అన్నారు. వేమూరు మండలంలోని వేమూరు, అబ్బనగూడవల్లి, చావలి గ్రామాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య పరిస్థితులు మెరుగవ్వటం వల్ల ప్రభుత్వం అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రకటించడం జరిగిందన్నారు. అందువల్ల ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు గంట సేపు యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సత్య, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి యోగా విశిష్టతను తెలియజేసి పలు ఆసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఐలవరం హైస్కూల్లో యోగాసనాలు వేయడంలో ప్రతిభ చూపిన విద్యార్థులు



ఎంపీడీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న డీఈవో కె. నారాయణ, ఏపీసీ సుధాకర్

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం



భట్టిప్రోలు: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య ఆరోగ్య సిబ్బంది కోరారు. శుక్రవారం భట్టిప్రోలులోని బీఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో కష్టం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. 40 సంవత్సరాలు నిండిన వారికి పరీక్షలు చేయించి వ్యాధి నివారణ మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చుండూరు(వేమూరు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ యం లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 25న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 26న 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. 6,7,8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులంతా ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఓలేటమ్మ నెల సంబరం



ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ ఓలేటమ్మ వారి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం నెల సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించుకుని పొంగళ్లు సమర్పించారు. పూజా కార్యక్రమాలు, సంబరాలను వైభవంగా నిర్వహించేలా నిర్వాహకుడు బేతపూడి రజనీకాంత్ కృషి చేశారు.

'జూన్' ఖర్చులు.. మధ్యతరగతి గుండె గుబేలు!

- పిల్లల చదువు కోసం తల్లిదండ్రులకు తప్పని భారం
- పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలతో బెంబేలు
- ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం అన్నదాతల పాట్లు
- చాలా కుటుంబాలపై ఈ నెలలో తీవ్ర ప్రభావం



చిన్నారులకు బూట్లు కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు



స్కూల్ బ్యాగులు కొంటున్న దృశ్యం

పొన్నూరు : జూన్ నెల పేరు చెబితే మధ్యతరగతి కుటుంబాల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. బడ్జెట్ లెక్క ఒక పట్టాన తేలదు. వేతనంపైనే ఆధారపడిన వారు, సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఈ నెల ఒక పరీక్షా సమయమనే చెప్పాలి. ఏడాది మొత్తంలో ఆదా చేసిన సొమ్ము కాస్తా ఈ నెలలో హరించుకుపోతుంది. తప్పనిసరి అవసరాలు, తప్పించుకోలేని ఖర్చులతో ఉక్కిరిబిక్కిరి అయ్యే మధ్య తరగతి కుటుంబాలకు ఈ నెల గడపడం పెద్ద సవాల్‌గా మారింది.

విద్యాసంస్థల ఫీజుల మోత..

జూన్ రెండో వారం నుంచి పాఠశాలల్లో తరగతులు, ప్రవేశాలు మొదలయ్యాయి. దీంతో పిల్లల ఫీజులు చెల్లించడం, దుస్తులు, పుస్తకాల కొనుగోలుకు తల్లిదండ్రులు రూ. వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. పిల్లల భవిష్యత్తు కోసమే కదా.. మనం ఇంతగా కష్టపడుతున్నదని చెప్పుకొనే సగటు తల్లిదండ్రులకు ఈ ఫీజుల భారం మోయలేనంతగా మారిపోయింది. దిగువ మధ్యతరగతి, పేద వర్గాలు సైతం తమ పిల్లల్ని ప్రైవేటు బడులకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. పుస్తకాలు, బ్యాగులు, క్యారేజ్ బ్యాగులు, బూట్లు వంటివి సిద్ధం చేయాలి. వీటిలో ఏ ఒక్కదానికి మినహాయింపు ఉండదు. దీంతో ఒక్కో విద్యార్థికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పొన్నూరు మండలంలో మొత్తం మొత్తం 29 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

విద్యా సామగ్రిపై ధరాఘాతం...

ఈ సంవత్సరం విద్యాలయాల్లో ప్రవేశ రుసుములు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. ప్రస్తుతం విద్యారంగంలో నెలకొన్న పోటీ కారణంగా పిల్లలను బాగా చదివించాలన్న కోరిక తల్లిదండ్రుల్లో నెలకొంది. మంచి పాఠశాలను ఎంపిక చేసుకోవడం దగ్గర నుంచి పిల్లలను పాఠశాలకు పంపించేందుకు రవాణా సదుపాయం, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సగటు జీవిపై ఇది ఆర్థిక భారం పెంచుతోంది.

బెదరగొడుతున్న ధరలు..

మండే ఎండలు కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపడంతో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. వాటితోపాటు నిత్యావసరాల ధరలు కూడా పెరిగి ప్రజలపై భారం పడింది. ప్రస్తుతం కూరగాయలు ఏవైనా రూ. 50కి పైమాటే. కందిపప్పు, మంచి నూనె, మాంసాహారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. టమాటా ధర కిలో రూ. 70 ఉంటే, కిలో కోడి మాంసం రూ.280కి చేరువైంది. మార్కెట్‌కు వెళుతుంటే కూరగాయల సంచి నిండడం లేదు గాని జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయని సామాన్యులు వాపోతున్నారు. రాబడికి తగ్గట్టుగా జూన్ నెల ఖర్చులకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిపుణులు తెలుపుతున్నారు.

పంటల సాగుకు పెట్టుబడులు..

రైతులు ఖరీఫ్ సాగు పనులు ఈ నెలలో ప్రారంభిస్తారు. పెట్టుబడులు సమకూర్చుకునేందుకు అప్పుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు ఈ సంవత్సరం బాగా పెరగడంతో పెట్టుబడులు ఎక్కువ పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు అన్నదాతలు సమాయత్తమయ్యారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



మాట్లాడుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: ల్యాబ్ టెక్నీషియన్లు తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్‌లతో తెనాలి పట్టణంలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా వ్యాధి కారక క్రిమిని, మలేరియాలోని వివిధ రకాలను ఎలా గుర్తించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్‌లకు పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ల్యాబ్ టెక్నీషియన్స్ బెన్నీ, తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్ శ్రీ విద్య, ధనలక్ష్మి, సుధీర్, కలాకర్ గుప్తా, శివకృష్ణ, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27న డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపేటలోని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 27వ తేదీ ఉదయం 11 గంటలకు పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. హాజరు కాలేని వారు తమ ఫిర్యాదులను లెటర్ పై డాక్ అదాలత్ అని రాసి ఈ నెల 25 లోపు తమ కార్యాలయానికి పంపాలని సూచించారు.

శ్రీవారికి చందన అలంకారం



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకి చేరాయి. శ్రీ స్వామి వారికి చందనం (గంధంతో) అలంకారం చేశారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో అష్టోర కలశ స్నపన అభిషేకాలు జరిగాయి. రాత్రి పుర వీధుల్లో రథోత్సవం అట్టహాసంగా కొనసాగింది. మహిళల కోలాటం అలరించింది. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

వేధింపుల వైద్యుడి నుంచి రక్షణ కల్పించండి

వైద్య ఆరోగ్య శాఖ మహిళా సిబ్బంది వినతి



కొల్లూరు పీహెచ్‌సీలో వైద్యురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కొల్లూరు : మహిళా వైద్య సిబ్బందిపై పీహెచ్‌సీ వైద్యాధికారి లైంగిక వేధింపుల ఫిర్యాదులపై వైద్యశాఖ జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల వైద్య సిబ్బందిలో ఆందోళన పెల్లుబికుతోంది. కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసిన దావులూరి రవిబాబు వైద్య సిబ్బందికి అసభ్య పదజాలంతో కూడిన మెసేజ్‌లు పంపడంతో పాటు లైంగిక వేధింపులకు గురి చేస్తుండటంతో గత ఏప్రియల్‌లో మహిళా వైద్య సిబ్బంది జిల్లా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. మహిళా సిబ్బంది ఫిర్యాదుపై ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఎటువంటి విచారణకు ఆదేశించక పోవడంతో తిరిగి వైద్యాధికారి రవిబాబు బెదిరింపులకు పాల్పడుతూ సిబ్బందిని భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు మహిళా సిబ్బందిని లైంగిక వేధింపులకు గురి చేసిన వైద్యాధికారిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రేపల్లె డిప్యుటేషన్‌పై పంపించి మమ అనిపించారు. వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఫోన్‌లు చేసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తనను ఎవ్వరూ ఏమి చేయాలేరని అనటంతో మహిళా వైద్య సిబ్బంది ఆందోళనకు కారణంగా మారింది. వీటికి తోడు డీఎంహెచ్ఓ విజయమ్మ సైతం ఇటీవల కొల్లూరు పీహెచ్‌సీకి వచ్చి వైద్యాధికారి రవిబాబుకు వత్తాసు పలకటం పట్ల ఉద్యోగులు వాపోతున్నారు. వైద్యాధికారి వ్యవహారంపై వైద్య సిబ్బంది టీడీపీ నాయకులను ఆశ్రయించడంతో వైద్యశాలలో ఆయన వ్యవహారంపై టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా వ్యవహరించిన వైద్యాధికారిపై విచారణలో జాప్యం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ డీఎంహెచ్ఓతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం విచారణ జరిపి చర్యలు చేపట్టాలని లేని పక్షంలో పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి దూళిపూడి కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య ఉన్నారు.

గుంటూరు ఛానల్‌లో పూడిక తొలగించాలి

పెదకాకాని: గుంటూరు ఛానల్‌లో తూటికాడ తొలగించాలని గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నంబూరు గ్రామం వద్ద గుంటూరు ఛానల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు ఛానల్ (కొత్తకాలువ) 47 కిలోమీటర్లు పొడవు ఉందని, 1966 నుంచి వేల ఎకరాలకు సాగునీరు అందించిందన్నారు. ఈ కాలువను ప్రకాశం జిల్లా వరకు పొడిగించి సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కాలువ కట్టలు తెగిపోయేలా తయారయ్యాయని, తుమ్మ చెట్లు పెరిగిపోయాయని, గుర్రపుడెక్క పెరిగిందన్నారు. ఇందులోని నీరు తాగితే రోగాల బారిన పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన కాలువ కట్ట పనులు చేయించి పూడిక తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా రైతులను సమీకరించి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, నంబూరు పార్టీ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, జొన్నల శ్రీనివాసరెడ్డి వెంకయ్య, పున్నయ్య, కొండయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

